సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ၊ 20 ၊ డిసెంబర్ ၊ 2023



ధర్మప్రచార మాసోత్సవాలు ప్రారంభం

8లో

కనకమహాలక్ష్మి దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మ ప్రచార మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి.



గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



వైభవంగా ధనుర్మాస పూజలు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవికి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు.

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్‌గా కొల్లాబత్తుల కార్తీక్

- పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లుగా ధాత్రి రెడ్డి, ప్రశాంత్‌కుమార్ నియామకం



కొల్లాబత్తుల కార్తీక్



ధాత్రిరెడ్డి



ప్రశాంత్‌కుమార్

సాక్షి,పాడేరు: జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత జే.శివ శ్రీనివాస్‌ను బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. కొద్ది నెలల నుంచి ఖాళీగా ఉన్న పాడేరు సబ్‌కలెక్టర్ పోస్టును కూడా ప్రభుత్వం భర్తీ చేసింది. ఇటీవల ఐఏఎస్ శిక్షణ పూర్తిచేసుకున్న పెద్దిటి ధాత్రిరెడ్డిని నియమించింది.అలాగే రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా ఎస్.ప్రశాంత్‌కుమార్ నియమించింది.అక్కడ సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్‌ను తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది.పాడేరులో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేసిన అశుతోష్ శ్రీవాత్సవను కొవ్వూరు సబ్‌కలెక్టర్‌గా ప్రభుత్వం నియమిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

జీసీసీ చైర్‌పర్సన్ పదవీ కాలం పొడిగింపు

- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన శోభా స్వాతిరాణి



సాక్షి, పాడేరు: రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి పదవీ కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీసీసీ చైర్‌పర్సన్‌గా స్వాతిరాణి విశేష సేవలు అందించారు. గిరిజన రైతుల వ్యవసాయ, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనకు కృషి చేశారు. కాఫీ రైతులకు దళారుల బెడద లేకుండా రికార్డు ధరతో కొనుగోలుకు చర్యలు చేపట్టారు. అరకు కాఫీకి దేశీయ మార్కెట్‌లో గుర్తింపు, జీసీసీ ఉత్పత్తులను తిరుమల తిరుపతి దేవస్థానానికి రికార్డు స్థాయిలో సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించారు. జీసీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు హెల్త్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పదవీ కాలాన్ని పొడిగించిన సీఎంజగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం


- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



గర్భిణి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

చింతపల్లి రూరల్: మాతా శిశుమరణాల నివారణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక గర్భిణుల వసతి గృహాన్ని పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు ప్రసవించే వరకు వసతి గృహంలోనే ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. గర్భిణులకు అందించాల్సిన సేవలపై వైద్యాధికారులకు ఆయన సూచనలిచ్చారు.

బెల్లం పులుపు ధ్వంసం



సారా తయారీ పాత్రలతో పోలీసులు

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీ శెట్టిబంద గ్రామంలో మంగళవారం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. సుమారు 1500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలు విరమించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధాన్యం, రాగులకు రికార్డు ధర

తుపాను కారణంగా ముంపు సమస్యను ఎదుర్కొన్న బాధిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. వారిని ఆదుకోవడమే లక్ష్యంగా కొనుగోళ్లు చేపట్టింది. రాగులు, ధాన్యానికి రికార్డుస్థాయిలో ధర చెల్లించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది.

- బాధిత రైతులకు బాసట
- నేరుగా కల్లాల వద్దకు వెళ్లి కొనుగోళ్లు
- రవాణా కష్టాలు తప్పడంతో అన్నదాతల్లో ఆనందం



దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు



పెదబయలు మండలం గంపరాయి ప్రాంతంలో రాగుల పంట నూర్పును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

సాక్షి,పాడేరు: ధాన్యం, రాగుల కొనుగోళ్లను అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. నేరుగా రైతుల కల్లాల వద్దకు వెళ్లి ప్రభుత్వ సిబ్బంది కొనుగోలు చేస్తున్నందున రవాణా అవస్థలు తప్పాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- పాడేరు డివిజన్‌లోని 16వేల హెక్టార్లలో రాగులు సాగవుతుండగా ఈ ఏడాది 3 వేల టన్నులు రైతుల నుంచి కొనుగోలు చేయాలని లక్ష్యం విధించింది. వచ్చే నెల 15వ తేదీలోగా కొనుగోళ్లు పూర్తిచేస్తామని అధికారవర్గాలు చెబుతున్నాయి.
- జిల్లాలో 54 వేల హెక్టార్లలో వరి సాగు అవుతుండగా 30 వేల టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం విధించింది. ఇప్పటివరకు 1150 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

కొనుగోళ్లు వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వం విధించిన లక్ష్యం మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పౌరసరఫరాలు, వ్యవసాయశాఖ అధికారులు కొనుగోళ్లు వేగవంతం చేశారు. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. మరోపక్క మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులతో మాట్లాడుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

- రంపచోడవరం డివిజన్‌లోని దేవీపట్నం, రాజవొమ్మంగి, గంగవరం, దేవీపట్నం, పాడేరు డివిజన్‌లోని కొయ్యూరు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

పంట, కొనుగోలు వివరాలు

రాగులు	: 16 వేల హెక్టార్లు
కొనుగోలు లక్ష్యం	: 3 వేల టన్నులు
ప్రభుత్వ ధర	: క్వింటా రూ.3,846
వరి	: 54 వేల హెక్టార్లు
కొనుగోలు లక్ష్యం	: 30 వేల టన్నులు
క్వింటా గ్రేడ్ 1	: రూ.2,203,
గ్రేడ్ 2	: రూ.2,183

- వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పాడేరు, చింతూరు డివిజన్ల పరిధిలో వరి నూర్పులు ఊపందుకున్నాయి. .
- రాగుల సాగు విషయానికొస్తే ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజన రైతులు పంట కోతలు,నూర్పుల పనుల్లో నిమగ్నమయ్యారు.
- వ్యవసాయశాఖ పంటకోత ప్రయోగాలను చేపట్టింది. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ పెదబయలు మండలం గంపరాయిలో రాగుల పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు.

ఆర్‌బీకేల్లో విక్రయించండి



జిల్లాలోని రైతులు ధాన్యం, రాగులను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించాలి. నాణ్యమైన తూకంతో పాటు గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పిస్తోంది. రైతులు తీసుకువెళ్లాల్సిన అవసరం లేకుండా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది నేరుగా కల్లాల వద్దకు వెళ్తున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి ఖాతాల్లోనే ప్రభుత్వం నేరుగా నగదు జమ చేస్తోంది.

– జే.శివశ్రీనివాస్, జాయింట్ కలెక్టర్, పాడేరు

ధరలిలా.. : ప్రభుత్వం ఈఏడాది కూడా ధాన్యం, రాగులకు గిట్టుబాటు ధర కల్పించింది. గ్రేడ్‌-1 ధాన్యం క్వింటా రూ.2,203, గ్రేడ్‌-2 క్వింటా రూ.2,183కు కొనుగోలు చేయాలని ఆదేశించింది. రాగులు క్వింటా రూ.3,846 కు కొనుగోలు చేస్తున్నారు. ధర బాగున్నందున రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గిరి విద్యార్థులకు నాణ్యమైన విద్య
సీఎం జగన్ తపన



ఏర్పాట్లపై కలెక్టర్ సుమిత్ కుమార్‌తో చర్చిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- చింతపల్లిలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



చింతపల్లి డిగ్రీ కాలేజీలో ఏర్పాటుచేసిన సభా వేదిక



విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

చింతపల్లి రూరల్: గిరి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని జిల్లా ఇన్‌చార్జి, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లి పర్యటించనున్న నేపథ్యంలో ఆయన మంగళవారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ సమిత్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి ఏర్పాట్లపై మాట్లాడారు. సభా వేదిక, హెలిప్యాడ్ ఏర్పాటు ప్రాంతాలను పరిశీలించారు. ట్యాబ్‌లు పంపిణీ చేసే గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్, తరగతి గదిలో ఐఎఫ్‌బీ ప్యానల్ బోర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు బాగుంటే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరిచేందుకు 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందిస్తుందన్నారు.అలాగే డిజిటల్ రూపంలో విద్యను అందిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఐదవ తరగతి నుంచి విద్యార్థులకు టోఫిల్, జీఆర్‌ఈ శిక్షణ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యావ్యవస్థలో పెనుమార్పులను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ ప్రాంతానికి వస్తున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు,చింతపల్లి ,గూడెం కొత్తవీధి ఎంపీపీలు అనూషదేవి, బోయిన కుమారి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సీఐ రమేష్ పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లి పర్యటనను విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పర్యటన విజయవంతం చేసేందుకు భారీగా జనసమీకరణ చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సభకు వచ్చిన వారికి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, సర్పంచ్ దురియా పుష్పలత, ట్రైకార్ డైరెక్టర్లు లోవరాజు, సరస్వతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి గణబాబు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, ఎస్టీ కమిషన్ సభ్యురాలు తెడబారికి లిల్లీ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జిల్లా బోధన ఆస్పత్రిలో ఉన్నత వైద్యసేవలు

- అందుబాటులోకి రానున్న 480 పడకలు
- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి
- భవన నిర్మాణ పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక జిల్లా బోధన ఆస్పత్రిలో 480 పడకలతో ఉన్నత వైద్య సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి తెలిపారు. మంగళవారం ఆమె తలారిసింగిలోని వైద్య కళాశాల భవన నిర్మాణాలతో పాటు జిల్లా బోధన ఆస్పత్రిలో అదనంగా నిర్మిస్తున్న మరో అంతస్తు భవన నిర్మాణాలను ఆమె పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులు, ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్షించారు.వైద్య కళాశాలకు సంబంధించి కళాశాల బ్లాక్‌లో కొన్ని భవనాలను తరగతులు ప్రారంభించేలా వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు అందుబాటులోకి తెస్తామని ఎన్‌సీసీ అధికారులు తెలిపారు. జిల్లా బోధన ఆస్పత్రితో పాటు తల్లీపిల్ల ఆస్పత్రిలో అదనంగా నిర్మిస్తున్న గదుల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని డాక్టర్ హేమలతాదేవి ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడేరు బోధన ఆస్పత్రిలో ప్రస్తుతం 200 పడకలు ఉన్నాయని, అదనంగా మరో 280 ఏర్పాటుకు సంబంధించి అదనంగా భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. బోధన ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ఆమె పేర్కొన్నారు.

కట్టుదిట్టంగా బందోబస్తు

ఎస్పీ తుహిన్ సిన్హా



చౌడుపల్లిలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీతుహిన్‌సిన్హా, ఏఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

చింతపల్లి రూరల్: ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. మంగళవారం ఆయన చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్‌తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 1500 మంది పోలీసులతో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. గ్రేహౌండ్స్,స్పెషల్ పార్టీ పోలీసులతో గాలికొండ, అన్నవరం, కోరుకొండ, సప్పర్ల, మంప, ధారకొండ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామన్నారు. వారి వెంట చింతపల్లి, గూడెం కొత్తవీధి సీఐలు రమేష్, అశోక్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌కిరణ్,అప్పలసూరి తదితరులు ఉన్నారు. హెలీకాప్టర్‌తో ట్రైల్‌రన్ నిర్వహించారు.

పర్యటన షెడ్యూల్ ఖరారు

సాక్షి, పాడేరు: ఈనెల 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లి పర్యటన ఖరారయ్యింది. ఈ సందర్భంగా ఆయన 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

- గురువారం ఉదయం 8.30 గంటలకు సీఎం తన నివాసం నుంచి బయలుదేరి 8.50 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఉదయం తొమ్మిది గంటలకు విమానంలో విశాఖపట్నం బయలుదేరుతారు. 9.50 గంటలకు విశాఖ చేరుకున్న తరువాత అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 10 గంటలకు చింతపల్లి పర్యటనకు బయలుదేరుతారు.
- చింతపల్లికి సమీపంలో చౌడుపల్లి గ్రామంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకుంటారు. అక్కడ పది నిమిషాల పాటు ప్రజలతో సీఎం మాట్లాడతారు. అనంతరం 10.45కు రోడ్డు మార్గంలో బయలుదేరి 10.50 గంటలకు చింతపల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1కు చేరుకుంటారు. 10.50 నుంచి 11.05 వరకు అక్కడి విద్యార్థులతో మాట్లాడతారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు.
- గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1లో ఉదయం 11.05 గంటలకు బయలుదేరి 11.10 గంటలకు చింతపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన టెక్ అనేబుల్డ్ లెర్నింగ్ అండ్ టీచింగ్ స్టాల్‌ను 11.10 నుంచి 11.15 గంటల వరకు సందర్శిస్తారు. 11.20 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు.
- మధ్యాహ్నం 12.30 గంటలకు సభా ప్రాంగణం నుంచి సీఎం రోడ్డు మార్గాన బయలుదేరి చౌడుపల్లిలోని హెలిప్యాడ్‌కు 12.40కు చేరుకుంటారు. 12.40 నుంచి 1.25 వరకు స్థానిక నాయకులతో సీఎం మాట్లాడతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు సీఎం తిరుగు ప్రయాణమవుతారు. 2.00 గంటలకు ఎయిర్‌పోర్టులో దిగిన వెంటనే 2.10 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. 3.00 గంటలకు గన్నవరంలో విమానం దిగి 3.10 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 3.30 గంటలకు సీఎం తన నివాసానికి చేరుకుంటారు.

సైనిక కుటుంబాల సంక్షేమం కోసం విరాళాల సేకరణ

మహారాణిపేట: దేశ రక్షణకు నిరంతర సేవలు అందిస్తూ యుద్ధంలో మరణించిన, గాయపడిన, పదవీ విరమణ పొందిన సైనిక కుటుంబాల సంక్షేమం కోసం విరాళాలు సేకరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. విద్యార్థులు, కార్మికుల నుంచి సైనికుల సంక్షేమానికి విరాళాలు సేకరించాలని, దీనిలో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా పరిశ్రమల అధికారికి ప్రభుత్వ ఉత్తర్వులు అందజేశామన్నారు. పాఠశాల విద్యార్థి నుంచి రూ.2, కాలేజీ విద్యార్థి నుంచి రూ.5, పరిశ్రమల్లో పనిస్తున్న కార్మికుల నుంచి రూ.50 పతాక నిధిని వసూలు చేసి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం ఎస్‌బీఐ అకౌంట్ 62078532988 నెంబరుకు జమ చేయాలని పేర్కొన్నారు.

వణికిస్తున్న చలిగాలులు



అరకులోయ ప్రాంతంలో దట్టంగా మంచు



ముంచంగిపుట్టులో కురుస్తున్న పొగమంచులో రాకపోకలు

- అరకులోయలో 11.4
- మినుములూరులో 12.
- చింతపల్లిలో 13.5 డిగ్రీల నమోదు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు వణికిస్తున్నాయి. సాయంత్రం నుంచి వీటి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 11 గంటల నుంచి పొగమంచు కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు అరకులోయ, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో మంచు తెరలు వీడడం లేదు. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. అరకులోయలో 11.4డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 12 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారులు తెలిపారు.

ఉదయం 10 గంటల వరకు..

ముంచంగిపుట్టు: మండలంలో ప్రతి రోజు ఉదయం 10 గంటల వరకు మంచు దట్టంగా కురుస్తోంది. మండల కేంద్రం నుంచి పెదబయలు, జోలాపుట్టు, డుడుమ మార్గాల్లో వెళ్లే వారు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. మూడు రోజులుగా కిలగాడ, గుమ్మా ఘాట్, వనభసింగి, ఒటిపుట్టు, రాజామామిడి మలుపుల వద్ద పొగమంచు కారణంగా వాహన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

సీలేరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌కు సంయుక్త సర్వే

- ఫారెస్ట్ భూమిని పరిశీలించిన ఏపీ జెన్‌కో, అటవీశాఖ అధికారులు
- ఉన్నతాధికారులకు నివేదిస్తాం: డీఎఫ్‌వో సూర్యనారాయణ
- 115 మెగావాట్ల సామర్థ్యంతో తొమ్మిది యూనిట్లు : ఏపీ జెన్‌కో



సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు



వాగులు దాటుతున్న అటవీశాఖ, జెన్‌కో అధికారులు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకం)కు సంబంధించి అవసరమైన భూమి కోసం ఏపీ జెన్‌కో, అటవీశాఖ అధికారులు మంగళవారం సంయుక్త పరిశీలన చేశారు. దీనిలో భాగంగా ప్రాజెక్ట్ నిర్మించబోయే ప్రదేశాలలో సర్వే నిర్వహించారు. ప్రాజెక్టుకు అవసరమైన అటవీభూమి, వన్యప్రాణాలు మనుగడ, పర్యావరణ పరిస్థితులు, అటవీసంపద వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సూర్యనారాయణ మాట్లాడుతూ జెన్‌కో ఎండీ కోరిన మేరకు క్షేత్రస్థాయి పరిశీలన జరిపామన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి 332 హెక్టార్ల భూమి అవసరం కాగా ఇందులో 215.44 హెక్టార్ల అటవీ భూమి ఉందన్నారు. గూడెం, సీలేరు బ్లాక్‌ల్లో రిజర్వ్ ఫారెస్టు భూమి ఉన్నందున పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు.

భవిష్యత్తులో మరింత విద్యుత్ ఉత్పత్తి

రాష్ట్రంలో రానున్న రోజుల్లో మరింత విద్యుత్ ఉత్పత్తిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి సారించిందని జెన్‌కో ఎస్‌ఈలు రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సంయుక్త పరిశీలనలో పాల్గొన్న వారు మాట్లాడుతూ సీలేరు పార్వతి నగర్ వద్ద ఒక్కొక్కటి 115 మెగావాట్ల సామర్థ్యంతో 9 యూనిట్ల నిర్మాణానికి సర్వేలు పూర్తికానున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే విద్యుత్ ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం నీరు వృథా కాకుండా శాండకోరి గ్రామం వద్ద ఆనకట్ట నిర్మించి తద్వారా భూమి అడుగుభాగం నుంచి పైప్‌లైన్ల ద్వారా తిరిగి గుంటవాడ రిజర్వాయర్‌కు మళ్లిస్తారన్నారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నుంచి అనుమతులు లభించాయన్నారు. అటవీశాఖ సర్వే, పర్యావరణ అనుమతులు మూడు నెలల్లో కొలిక్కి వస్తాయన్నారు. సీలేరు రేంజిలో అటవీశాఖ నుంచి జెన్‌కోకు ఇస్తున్న భూమి, దానికి బదులుగా సత్యసాయి జిల్లాలో జీఏ ల్యాండ్‌ను ఇచ్చేందుకు చర్యలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సర్వేలో సబ్ డీఎఫ్‌వో బెన్నాడ రాజు, రేంజర్ శ్రీనివాస్, జెన్‌కో అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పైడిరాజు, ప్రభాకర్, ఏడీఏ అప్పలనాయుడు, ఏఈఈ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా మహాలక్ష్మి, గోదాదేవి, శ్రీవారి ఆలయం, హనుమాన్ ఆలయాలను శుభ్రం చేశారు. ఏడాదికి మూడు సార్లు నిర్వహించే ఈ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంను వైకుంఠ ఏకాదశికి ముందు వచ్చే మంగళవారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమంజనం అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భక్తులకు యథావిధిగా శ్రీవారి దర్శనం కల్పించారు. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు కిశోర్, శివ, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

ఎన్నికల పర్యవేక్షకుడి విశాఖ పర్యటన నేడు

మహారాణిపేట: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024లో భాగంగా ఏపీ ఓటరు జాబితా పర్యవేక్షకుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు బుధవారం విశాఖలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆయన విశాఖలో అందుబాటులో ఉంటారని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అనంతరం శ్రీకాకుళం వెళతారని, 22న అల్లూరి సీతారామరాజు జిల్లా(పాడేరు)లో పర్యటిస్తారని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్-3 చార్జింగ్ ప్రారంభం



బ్లాస్ట్‌ఫర్నేస్-3 ముఖచిత్రం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు శుభవార్త. గత 21 నెలలుగా ఎదురు చూస్తున్న బ్లాస్ట్‌ఫర్నేస్-3 ఉత్పత్తికి సంబంధించి మంగళవారం మొదటి అడుగు పడింది. బ్లాస్ట్‌ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించి మొదటి బ్యాచ్ కోక్ సాయంత్రం 4.55 గంటలకు చార్జింగ్ ప్రారంభించారు. ఆ తర్వాత 30 టన్నుల చెక్క, అనంతరం 200 టన్నుల కోక్‌తో చార్జింగ్ చేయనున్నారు. ఈ నెల 30న ఉత్పత్తి ప్రారంభించడానికి యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా దశల వారీగా ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడం ద్వారా ఉద్యోగులు తమకు మంచి రోజులు రానున్నాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మరుగుదొడ్ల సొమ్ములు బుక్కేసిన టీడీపీ నాయకులు



రాజవొమ్మంగి ఉచితగ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



అడ్డతీగలలోగ్యాస్ కనెక్షన్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మాణానికి పేద మహిళలకోసం గత ప్రభుత్వ హయాంలో మంజూరైన కోట్లాది రూపాయలను కాజేసిన ఘనత టీడీపీ నేతలకే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మహిళల పేరిట మంజూరైన నిధులను మండల టీడీపీ నాయకులు బుక్కేయడంతో నేటికి చాలా మందికి వ్యక్తి గత మరుగుదొడ్లు లేని దుస్థితి నెలకొందన్నారు. అదే విధంగా గత ప్రభుత్వ హయాంలో పేద మహిళల కోసం మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్లు స్వాహా చేసిన ఘనత కూడా వారికే దక్కుతుందన్నారు. నేడు ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం ఎంతో ఆశగా పేద మహిళలు దరఖాస్తు చేసుకుంటే, ఇప్పటికే వారికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపిస్తోందని, ఇలా అన్యాయానికి గురైన వారు ఏజెన్సీలో చాలా మంది ఉన్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎటువంటి అవినీతి అక్రమాలు లేకుండా నేరుగా లబ్ధిదారుకే సంక్షేమపథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసిన కొద్ది రోజుల్లోనే ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు గంగదుర్గ, నిర్మలదేవి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, చీడి శివ, ఆగూరి శుభలక్ష్మి, గణలక్ష్మి, సత్యవతి, సత్యనారాయణ, కోఆప్షన్ మెంబర్ కామేష్, నాయకులు దాట్ల వెంకటేష్‌రాజు, శాంతకుమారి, కుశరాజు, జాన్‌బాబు, సింగిరెడ్డి రవి, బొడ్డు వెంకటరమణ, ముప్పన సురేష్, మంతెన ముసలయ్య, చంద్రరావు, చప్పా ప్రసాద్, వీరబాబు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, జీసీసీ డీఎం పార్వతీశం పాల్గొన్నారు.

మహిళల కష్టాలు తీర్చడానికే గ్యాస్ కనెక్షన్లు

అడ్డతీగల: మహిళల కష్టాలు తీర్చడానికే గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత బాబు తెలిపారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక జీసీసీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇరువురు నేతలు మండలవ్యాప్తంగా 222 మంది లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేద మహిళలందరికీ గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేస్తామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి,సంక్షేమ పథకాలను అమలుచేస్తూ, జనరంజకమైన పాలన చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు, వైఎస్ ఎంపీపీ కరణం వీర వెంకట సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కారు రాంబాబు పాల్గొన్నారు.

మరి కొంతకాలం స్పెషల్ రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా ప్రాంతాలకు ప్రస్తుతం నడుస్తున్న స్పెషల్ రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

- విశాఖపట్నం-కర్నూలు సిటీ (08585) వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతి మంగళవారాల్లో సాయంత్రం 5.35గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.25 గంటలకు కర్నూలు సిటీ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జనవరి 16, 23, 30 తేదీల వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో కర్నూలు సిటీ-విశాఖపట్నం (08586) వీక్లీ స్పెషల్ మహబూబ్‌నగర్‌లో ప్రతి బుధవారాల్లో మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జనవరి 17, 24, 31వ తేదీ వరకు పొడిగించారు.
- భువనేశ్వర్-తిరుపతి(02809) వీక్లీ స్పెషల్ ప్రతి శనివారాల్లో మధ్యాహ్నం 1.30 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 7.35 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు ఉదయం 10.30గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు జనవరి 13, 20, 27వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి-భువనేశ్వర్(02810) వీక్లీ స్పెషల్ ప్రతీ ఆదివారం రాత్రి 8.15 గంటలకు తిరుపతిలో బయల్దేరి, మరుసటిరోజు ఉదయం 9.30గంటలకు దువ్వాడకు అదేరోజు సాయంత్రం 5.25 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ జనవరి 14, 21, 28వ తేదీ వరకు పొడిగించారు.

పలు రైళ్ల రద్దు

వాల్తేర్ డివిజన్ పరిధి సింహాచలం నార్త్ యార్డ్ విశాఖపట్నం-వలాస సెక్షన్ పరిధిలో ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం(08546/08545) పాసింజర్ స్పెషల్ ఈ నెల 23, 24 తేదీల్లో ఇరువైపులా, విశాఖపట్నం-విజయనగరం-విశాఖపట్నం (07468/07469) మెము పాసింజర్ ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఇరువైపులా రద్దు చేశారు.

గమ్యం కుదింపు

విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం (07470/07471)మెము స్పెషల్ పాసింజర్ ఈ నెల 23, 24, 25 తేదీల్లో విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది.

దారి మళ్లింపు

ఈ నెల 22వ తేదీన బెంగళూరు-హౌరా(12246) ఎక్స్‌ప్రెస్, ఈరోడ్- సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు గోపాలపట్నం-విశాఖపట్నం-సింహాచలం నార్త్ స్టేషన్ల మీదుగా నడుస్తాయి.

హోంగార్డు నియామక పత్రాల అందజేత

విశాఖ సిటీ: నగరంలోని హోంగార్డు యూనిట్‌లో విధి నిర్వహణలో మరణించిన ఇద్దరు హోంగార్డు కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అందజేశారు. హోంగార్డులు పి.వి.సత్యనారాయణ, జి.ప్రకాశరావు కొద్ది కాలం క్రితం విధి నిర్వహణలో మరణించారు. దీంతో సత్యనారాయణ భార్య పి.వరలక్ష్మికి, ప్రకాశరావు భార్య జి.ప్రియాంకకు హోంగార్డులుగా నియామక పత్రాలు సీపీ తన చాంబర్‌లో అందజేశారు.

కార్యక్రమంలో విశాఖ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ యు.రామ్మోహన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(అడ్మిన్ అండ్ హోంగార్డ్స్) టి.భగవాన్ పాల్గొన్నారు.

ఆయుధాల తనిఖీ తప్పనిసరి

సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: అన్ని రకాల ఆయుధాలు, పరికరాలను విధుల్లో వినియోగించాలని.. క్రమం తప్పకుండా వాటిని తనిఖీ చేసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీసులను ఆదేశించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో మంగళవారం పలు విభాగాల పనితీరును సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది తమ విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, రైట్ గేర్ పరికరాలు వినియోగించే తీరు, డాగ్ స్క్వాడ్‌తో బాంబు డిటెక్షన్, నార్కోటిక్స్‌ను ఏ విధంగా వెలికి తీస్తాయో చేసిన ప్రదర్శనలను గమనించారు. కే 9 డాగ్ బృందాన్ని అభినందించారు. మాబ్ ఆపరేషన్‌లో బాష్పవాయువు ప్రయోగిస్తూ గుంపులను ఏ విధంగా చెదరగొడతారో పరిశీలించారు. అనుకోని విపత్తులు ఎదురై ఉగ్రవాద లేదా సంఘ విద్రోహ సంస్థలు దాడులు జరిపినపుడు.. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని, తిప్పికొట్టే విధంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




బాంబ్ డిటెక్షన్ పరికరాలను పరిశీలిస్తున్న సీపీ

పూర్వ విద్యార్థినిపై లైంగిక దాడికి యత్నం

పోలీసుల అదుపులో నిందితుడు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థినిపై అదే ప్రాంతంలోని ఫ్లైవుడ్ ఫ్యాక్టరీకి చెందిన ఉత్తరాది కార్మికుడు మంగళవారం లైంగిక దాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పార్వతీపురానికి చెందిన ఆమె 2021లో ఇక్కడి కళాశాలలో సీఎస్‌సీ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆ కళాశాలను మరో యాజమాన్యం నిర్వహిస్తోంది. కాగా.. సర్టిఫికెట్ల కోసం వచ్చిన ఆమెపై మద్యం సేవించిన కార్మికుడు నిర్మానుష్య ప్రాంతంలో దాడికి యత్నించాడు. ఇది గమనించిన పశువుల కాపరులు(మహిళలు).. ఆమెను రక్షించి తీసుకువెళ్లారు. కళాశాల సిబ్బంది ఫిర్యాదుతో భీమిలి పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆమెను భీమిలి స్టేషన్‌కు తరలించి.. ఆమెతో పాటు స్థానికులను విచారించారు. వారు చెప్పిన వివరాలతో దాకమర్రి, బోడమెట్టపాలెం పరిసర ప్రాంతాల్లోని ఫ్లైవుడ్ ఫ్యాక్టరీల్లో గాలించి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. భీమిలి సీఐ డి.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతుడు రాము

మునగపాక : మండలంలోని నాగులాపల్లికి చెందిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మంగళవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఇటుకుల అప్పారావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు రాము స్థానికంగా డెకరేషన్ పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. దీనిలో భాగంగా గ్రామంలో ఇటీవల జరిగిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్ తొలగించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో స్థానికులు రామును అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో కుటుంబానికి అండగా నిలుస్తాడని భావించిన తమకు తీరని దుఃఖం మిగిల్చావంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అయ్యారు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ దొర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోవిడ్‌పై ఫుల్ కేర్

- ప్రభుత్వ ఆదేశాలతో అత్యవసర ఏర్పాట్లు
- ఆస్పత్రుల్లో మాక్‌డ్రిల్‌కు చర్యలు
- 21 నుంచి కరోనా నిర్ధారణ పరీక్షలు



కేజీహెచ్‌లో సిద్ధం చేసిన పడకలు 160

పుష్కలంగా ఆక్సిజన్, వెంటిలేటర్లు, కిట్స్, మందులు



మహారాణిపేట(విశాఖ): కరోనా.. రూపం మార్చుకుని మళ్లీ కలవరపెడుతోంది. కొత్త వేరియంట్ జేఎన్1 విజృంభిస్తోంది. కొద్ది రోజులుగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతుండడంతో.. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో కేజీహెచ్, విమ్స్, ఛాతి ఆస్పత్రి, పెందుర్తి, గోపాలపట్నం, అగనంపూడి, భీమిలి తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రులను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. కేజీహెచ్‌లో ఐసోలేషన్ వార్డుతోపాటు మరో వార్డులో మొత్తం 160 పడకలను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో ఆక్సిజన్, ఐసీయూ, వెంటిలేటర్, సాధారణ పడకలు ఉన్నాయి. మిగిలిన ఆస్పత్రుల్లో కూడా పడకలు సిద్ధం చేస్తున్నారు. కరోనా కోసం కేటాయించిన అన్ని ఆస్పత్రుల్లో మాక్‌డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ల పనితీరును పరిశీలించాలన్నారు. మరోవైపు ఈ నెల 21 నుంచి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 63 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా.. ఒమిక్రాన్ రూపం మార్చుకుని జేఎన్-1గా ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.

ఈ వేరియంట్ కారణంగా జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి తదితర లక్షణాలు ఉంటాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. కొంత మందిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నట్లు చెప్పారు. రాబోయేది పండగ సీజన్ కాబట్టి.. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని, మాస్కులు ధరించాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

సాగర తీరంలో సూపర్ పంచ్

ఉత్సాహంగా సీఎం బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌షిప్



బౌట్‌ను ప్రారంభిస్తున్న కాయల వెంకట రెడ్డి



బాక్సింగ్ చేస్తున్న క్రీడాకారులు

బీచ్‌రోడ్డు(విశాఖ): సాగర తీరంలో సూపర్ పంచ్‌లు సందర్శకులను అలరించాయి. ఒకరి మీద ఒకరు దూకుడిగా పంచులు విసురుతో నువ్వా నేనా అన్నట్లు ఎంతో ఉత్సాహంగా బాక్సింగ్ పోటీల్లో తలపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీఎం బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం వైఎంసీఏ వద్ద ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకొని గత మూడేళ్లగా బాక్సింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో మరిన్ని క్రీడా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జన్మదినమైన 21వ తేదీన పోటీల్లో విజేతలకు ట్రోఫీ, నగదు ప్రోత్సాహకాలు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొంటారన్నారు.

క్రీడాకారులకు సువర్ణావకాశం

సీఎం జగన్ పుట్టినరోజున పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ పోటీలు క్రీడాకారులకు ఒక సువర్ణ అవకాశమని జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి అన్నారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఇదో చక్కని అవకాశం అన్నారు.

150 మంది క్రీడాకారులు, 12 విభాగాలు

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరికి 12 విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు. యూత్, జూనియర్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

తొలి రోజు 26 బౌట్లు

తొలిరోజు మూడు విభాగాల్లో 26 బౌట్లు నిర్వహించారు. యూత్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సందర్శకులకు ఎంతో ఆసక్తిగా మ్యాచ్‌లను తిలకించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

రావికమతం : కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కొత్తూరు గ్రామ శివార్లలో 3 వేల లీటర్ల బెల్లం పులుపును ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి మంగళవారం ధ్వంసం చేశారు. నాటు సారా తయారీ జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో డ్రమ్ముల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3 వేల లీటర్ల పులుపును గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీకి పాల్పడితే కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు పేర్కొన్నారు.



సారా పులుపుతో ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది

ఆరోగ్యశ్రీతో పేదలకు మరింత భరోసా

అనకాపల్లి: బలహీనవర్గాల ప్రజల పాలిట సంజీవనిలా ఉన్న ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25లక్షలకుపెంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరింత భరోసా కల్పించారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌అన్నారు. గోపాలపురం సచివాలయ పరిధిలో మంగళవారం నూతన ఆరోగ్య శ్రీ కార్డులను ఆయన పంపిణీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైద్యం కోసం పేదలు అప్పు చేయాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో వైద్యసహాయం అందించేలా కొత్త ఆరోగ్యశ్రీ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు.

ధర్మప్రచార మాసోత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి మాసోత్సవాలు ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



పూజలు నిర్వహిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ఈవో శిరీష



ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా లిపికారెడ్డి బృందంచే నృత్య ప్రదర్శన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మప్రచార మాసోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి అంకురార్పణ చేశారు. నాదస్వర వాయిద్యాలు, పులివేషాలు, అమ్మవారి అలంకరణలు, కోలాట నృత్యాల నడుమ మాసోత్సవాలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఉత్సవాలు వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ధర్మ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా హిందూ ధర్మం విశిష్టత, గొప్పతనాన్ని వివిధ ప్రాంతాల ప్రజలకు తెలియజేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ హిందూ ధర్మ విశిష్టత, మానవతా విలువలు, అందులో దేవాలయాల పాత్ర గురించి వివరించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రచార రథం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు, హిందూ ధర్మం విశిష్టత తెలియజేసే పారాయణాలు, సాహిత్యపురాణ ఇతిహాస సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ డైరక్టర్ వేదాంతం రాజగోపాలచక్రవర్తి, దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వి.సురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎస్.సుజాత, ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.